క్లుప్తంగా

సీపీఐ పట్టణ కార్యదర్శిగా మునకాల


సీపీఐ పట్టణ కార్యవర్గ సభ్యులు

బొబ్బిలి: పట్టణంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అధ్యక్షతన సీపీఐ మహాసభలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శులు, సహాయ కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా మునకాల శ్రీనివాసరావు నాలుగోసారి ఎన్నిక కాగా, సహాయ కార్యదర్శులుగా గొల్లపల్లి తౌడు,కొలుసు వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చెరువుల ఆక్రమణ, ప్రభుత్వ స్థలాల కబ్జా వంటి అంశాలతో పాటు పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేలా ప్రభుత్వంతో పోరాటం సాగిస్తామన్నారు.

వాహన తనిఖీలు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

రాజాం సిటీ: మండలంలోని కొత్తవలస జంక్షన్ వద్ద పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన చోదకుల లైసెన్స్, వాహనాల సంబం ధిత పత్రాలను పరిశీలించారు. లైసెన్స్ లేని వారు వాహనాలు నడపరాదని, ద్విచక్రవాహన చోదకులు తప్పక హెల్మెట్ ధరించాలని ఎస్ఐ వై.రవికిరణ్ సూచించారు. గంజాయి, మత్తు పదార్థాలు రవాణా జరగకుండా గట్టి నిఘా పెట్టామని తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బేబి నాయన, బుడా చైర్మన్ తెంటు

బొబ్బిలి: వివిధ ఆరోగ్య సమస్యలకు చికిత్స చేయించుకున్న బొబ్బిలి,బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాలకు చెందిన పలువురు ఆర్థిక సహాయం కోసం సీఎం సహాయనిధికి గతంలో దరఖాస్తు చేసుకున్నారు. వీరికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సహాయం అందింది. సంబంధిత చెక్కులను ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు లబ్ధిదారులకు పట్టణంలో ఆదివారం అందజేశారు. ఆయా మండలాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం


రక్తదాతలను అభినందిస్తున్న ఎంపీపీ సన్యాసినాయుడు

మెంటాడ: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ జ్ఞాపకార్థం జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గచ్చించెట్టు వద్ద ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు ప్రారంభించారు. గ్రామంతో పాటు చుట్టు పక్క గ్రామాలకు చెందిన 60 మంది యువకులు రక్తదానం చేశారు. రక్తదాతలను నిర్వాహకులు గ్రామ పెద్దలు, సర్పంచ్ ఆర్.రాంబాబు, మాజీ సర్పంచ్ రంగరాజు అభినందించారు.

రోడ్డుపై మురుగు ప్రవాహం


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

రాజాం: పట్టణంలోని పాగిరి రోడ్డులోని ది సన్ స్కూల్ సమీపంలో నిత్యం మురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. అటు ఆర్అండ్‌బీ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఉపాధి వేతనాలు
జమ చేసేదెప్పుడు...?


రాజాం మండలం అంతకాపల్లిలో వేతనాలు చెల్లించాలని ఎంపీడీఓను కోరుతున్న వేతనదారులు(ఫైల్)

- రెండు నెలలుగా అందని వేతనాలు
- పనులకు స్వస్తిచెబుతున్న వేతనదారులు
- వేతనాల కోసం రాజాం నియోజకవర్గంలో 32 వేల మంది ఎదురుచూపులు

రాజాం:

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యానికి చిల్లులు పడ్డాయి. ఉపాధి పనులు అంటే గతంలో జాతరలా ఉండేది. కానీ గత రెండు వారాలుగా ఈ పనులపై వేతనదారులకు ఆసక్తి తగ్గింది. రోజూ సగటున ప్రతీ మండలంలో 6నుంచి 13 వేల మంది వేతనదారులు ఈ పనులకు వెళ్లేవారు. ప్రస్తుతం ఈ పనులకు ఒక్కో మండలంలో సగటున 3వేల మంది కూడా పనులకు హాజరు కావడం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

చెల్లింపులకు బ్రేక్..

గత రెండు నెలలుగా ఉపాధి వేతనదారులకు చెల్లింపులు నిలిచిపోయాయి. రోజువారీ పనిచేస్తే కనీస వేతనం రూ.300 వస్తుందని చెప్పిన అధికారులు వేతనాలు చెల్లించ డంలో విఫలమయ్యారు. కనీస వేతనం రోజుకు ఒక్కోచోట రూ. 70 కూడా రాని పరిస్థితి ఉంది. ఆ అరకొర వేతనం కూడా సకాలంలో చెల్లించలేని దౌర్భాగ్యం నెలకొం ది. ప్రభుత్వ చొరవ కొరవడడంతో పాటు పాలకులు పట్టించుకోకపోవంతో వేతనదారులకు మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి వేతనాలు అందలేదు. గతంలో ప్రతీ 15 రోజులకు ఒకసారి వేతనదారుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమయ్యేవి. గత రెండు నెలలుగా ఇవి జమ కాలేదు. ఒక్కో వేతనదారునికి రెండు నుంచి మూడునెలలు కాలానికి చెందిన వేతనం అందాల్సి ఉంది. సగటున ఒక్కొక్కరికీ రోజువారీ వేతనం రూ.100 లెక్క కట్టినా రూ.6 వేల వరకు వేతనం రావాల్సి ఉంది. ఇవి జమచేయక పోవడంతో గత రెండు వారాలుగా పనులకు హాజరవుతున్న వారి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఉపాధి పనులకు గతంలో రాజాం మండలంలో 6 వేల మంది వెళ్తే ప్రస్తుతం రోజుకు 800 నుంచి 1,100 మంది మాత్రమే వెళ్తున్నారు. వంగర, రేగిడి, సంతకవిటి మండలాల్లో కూడా ఇదే పరిస్థితి ఉంది. రేగిడిలో గతంలో 12 వేల మంది నమోదుకాగా ప్రస్తుతం 1500 మంది, వంగరలో గతంలో రోజూ 4200 మంది వరకూ పనులకు హాజరు కాగా ప్రస్తుతం 880 మంది, సంతకవిటిలో గతంలో 3500 నుంచి 5 వేల మంది హాజరు కాగా ప్రస్తుతం మంది 1,200 మంది హాజరవుతున్నట్లు సమాచారం. తమకు వేతనాలు రాకపోవడంతోనే పనులకు వెళ్లడం లేదని వేతనదారులు చెబుతున్నారు.

చెల్లింపుల్లో జాప్యం వాస్తవమే...

ఉపాధి వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతున్న మాట వాస్తవమే. ఏ వారానికి ఆ వారం బిల్లుల చెల్లింపులకు సంబంధించిన ప్రక్రియ స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో పూర్తయింది. కానీపై నుంచి నిధులు రావాల్సి ఉంది. వేతనాలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమవుతాయి. ప్రస్తుతం ఉపాధి పనులకు హాజరవుతున్న వేతనదారుల సంఖ్య తగ్గుతోంది.

– వి.శ్రీనివాసరావు, రాజాం ఎంపీడీఓ

రెండు నెలలుగా బకాయి

మాకు గత రెండు నెలలుగా ఉపాధి వేతనాలు జమకాలేదు. పనులకు వెళ్లాలంటే ఆసక్తి ఉండడంలేదు. గతంలో 15 రోజుల్లో డబ్బులు పడేవి. ఇప్పటి వరకూ చేసిన పనులకు డబ్బులు ఎప్పుడు వస్తాయో, ఎంత వస్తుందో అర్థం కావడంలేదు.

– మీసాల అప్పడు, ఉపాధి వేతనదారుడు, శిర్లాం, రేగిడి మండలం

ఎదురుచూస్తున్నాం

ఉపాధి వేతనాలను ప్రభుత్వం సకాలంలో చెల్లించడం లేదు. గత ఎనిమిది వారాల నుంచి డబ్బులు అందలేదు. వెంటవెంటనే డబ్బులు వస్తే పనులు చేసేందుకు ఆసక్తి ఉంటుంది. డబ్బులు సకాలంలో రాకపోవడంతో ఉపాధి పనులపై ఆసక్తి తగ్గుతోంది.

– బి. సత్యవతి, ఉపాధివేతనదారు, కంచరాం, రాజాం మండలం

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగించుకోండి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవా లని ఎంఈఓ జె.త్రినాథరావు విద్యార్థులకు సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులను ఆదివారం పరిశీలించారు. విజ్ఞాన శిబిరానికి ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారని, ఇంతవరకు ఏయే అంశాల్లో విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చా రని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తిని అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ వెంట నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు ఉన్నారు.

నేటి నుంచి గ్రామదేవతల పండగ

తెర్లాం: మండలంలోని కుసుమూరులో గ్రామదేవతలు పాదాలమ్మ, పెదపైడమ్మ పండగ సోమ వారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు గ్రామపెద్దలు ఆదివారం తెలిపారు. సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం సిరిమానోత్సవం, బుధవారం అనుపోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

ప్రారంభించేదెప్పుడు..?


తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాల సముదాయం

రేగిడి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకో వడం లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తహసీల్దార్ కార్యాలయ నూతన భవనాల నిర్మాణానికి రూ.90 లక్షలు మంజూరయ్యాయి. భవన నిర్మాణంతో పాటు మిగతా పనులన్నీ గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. అయితే కొంతమేర బిల్లులు పెండింగ్ ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్ బిల్డింగ్‌ను ప్రారంభోత్సవానికి అప్పగించడం లేదు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం నిర్వహిస్తున్న భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి బిల్లులు క్లియర్ చేయించి, నూతన భవనాలను ప్రారంభించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మండు వేసవిలోనూ నిండు కుండలా...


నీటితో నిండుకుండలా కోనేరు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేట గ్రామంలో మంచినీటి కోనేరు నిండు కుండను తలపిస్తోంది. మండు వేసవిలోనూ కోనేరులో పుష్కలంగా నీరు ఉండడంతో మూగజీవాలకు తాగునీటి ఇబ్బంది లేదని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాట్ ఫారాలు నిర్మించరూ..


శ్రీరాంనగర కాలనీలోని చాకలి వీధి కుళాయి పాయింట్ వద్ద శిథిలమైన ప్లాట్ ఫారం


చొక్కాపు వీధిలోని కుళాయి వద్ద ప్లాట్ ఫారంను తవ్వేసి వదిలేసిన దృశ్యం

రామభద్రపురం: మండల కేంద్రంలో పలు తాగు నీటి కుళాయి పాయింట్‌ల వద్ద ప్లాట్ ఫారాలు శిథిలం కావడం, కొన్ని చోట్ల తవ్వేసి వదిలేయడంతో తాగునీరు పట్టుకునేందుకు మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.చొక్కాపు వీధిలో కుళాయి పైపులైన్‌కు మరమ్మతులు చేసేందుకు కొన్ని నెలల క్రితం పంచాయతీ సిబ్బంది ప్లాట్ ఫారం తవ్వేసి అలాగే వదిలేశారు. శ్రీరాంనగర్ కాలనీలోని చాకలి వీధిలో కుళాయి వద్ద ప్లాట్ ఫారం పూర్తిగా శిథిలమైంది.పంచాయతీ అధికారులు స్పందించి ప్లాట్ ఫారాలు నిర్మించాలని కోరుతున్నారు.

ప్రమాదాల బైపాస్..!


బైపాస్ రోడ్డులో కనిమెరక వీధి-గొర్లె వీధి జంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్ర వాహనచోదకులు

- రామభద్రపురం –సాలూరు బైపాస్ రోడ్డులోని పలు కూడళ్లలో తరచూ యాక్సిడెంట్‌లు
- రోడ్డులో వెలగని విద్యుత్ దీపాలు
- కానరాని హెచ్చరిక, సూచిక బోర్డులు


బైపాస్ రోడ్డులో మితిమీరిన వేగంతో వస్తున్న భారీలారీ

రామభద్రపురం: జాతీయ రహదారి–26 పరిధిలోని రామభద్రపురం–సాలూరు బైపాస్ రోడ్డులో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ రహదారిలో హెచ్చరిక బోర్డులు, కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, విద్యుత్ దీపాలు వెలగకపోవడం, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని మండల ప్రజలు అంటున్నారు. సాలూరు వైపు వెళ్లే రోడ్డులో కనిమెరక వీధి, గొర్లెవీధి, చందాన వీధి,సంతతోట జంక్షన్, అలాగే రామభద్రపురం గ్రామం మధ్య నుంచి జాతీయ రహదారి మీదకు వెళ్లే వై జంక్షన్, ఆరికతోట జంక్షన్, కొట్టక్కి జంక్షన్‌లు డేంజర్‌గా మారాయి. ఈ జంక్షన్‌లలో జరిగిన ప్రమాదాల్లో ఎంతోమంది వాహన చోదకులు, ప్రయాణికులు మృతి చెందగా, కొందరు క్షతగాత్రులుగా మిగిలిపోయారు.

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు..

ఈనెల 4వ తేదీన కొండకెంగువ జంక్షన్ వద్ద వేకువ జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని స్థానిక శ్రీరాంనగర్ కాలనీకి చెందిన చలమల సత్యవతి(64) అక్కడికక్కడే దుర్మరణం చెందింది. గత ఏడాది నవంబర్ 26వ తేదీ రాత్రి కూడా అదే జంక్షన్‌లో రామభద్రపురం గ్రామానికి చెందిన యువకుడు మురళీకృష్ణ కనిమెరక-,గొర్లె వీధి జంక్షన్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో భార్య,పిల్లలు కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోయారు.అదే ఏడాది నవంబర్ 27వ తేదీన కొట్టక్కి జంక్షన్ వద్ద ఓ ఏఎన్ఎం తన భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏఎన్ఎం తీవ్రంగా గాయపడ్డారు.

అంధకారంతో ఇబ్బందులు..

రాత్రి సమయాల్లో బైపాస్‌లో చీకటి రాజ్యమేలుతోంది. పలు కూడళ్ల వద్ద విద్యుత్ దీపాలు వేయకపోగా, ఉన్న చోటవెలగడం లేదు. దీంతో ఆ కూడళ్లలో పాదచారులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. విద్యుత్ దీపాల ఏర్పాటుతో కొంతవరకు ప్రమాదాలను నియంత్రించవచ్చని మండల ప్రజలు అంటున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం



డేంజర్ జంక్షన్‌లు, ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేదా స్పీడు బ్రేకర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం విద్యుత్ దీపాలు లేకపోవడంతో స్టాపర్లు పెట్టలేకపోతున్నాం.స్టాపర్లు ఉంటే చీకటిలో వాహనాలకు ఇబ్బంది కలుగుతుంది.స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు ఆర్అండ్‌బీ అధికారులకు లేఖ రాస్తాం.ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

– కె నారాయణరావు, సీఐ

విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తాం



బైపాస్ రోడ్డులో విద్యుత్ దీపాలు లేవని నా దృష్టికి వచ్చింది .రెండు నెలల్లో విద్యుత్ దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.పంచాయతీ బోర్డు సమావేశంలో తీర్మానం చేసి ఏర్పాటు చేస్తాం.

–శ్రీనివాసరావు, ఈఓ, రామభద్రపురం మేజర్ పంచాయతీ

దయనీయంగా సాగునీటి కాలువలు



రేగిడి మండలంలోని మడ్డువలస ప్రధాన కాలువతోపాటు పొలాలకు సాగునీరందించే పిల్లకాలువల పరిస్థితి దయనీయంగా మారింది. పెద్దశిర్లాం నుంచి వన్నలి వరకు ప్రధాన కుడికాలువ లైనింగ్ పనులు చేయకపోవడంతో గట్లు కోతకు గురై కాలువ పూడుకుపోతుంది. ప్రధాన కాలువకు అనుసంధానంగా ఉన్న పిల్లకాలువలో తుప్పలు, డొంకలు ఏపుగా పెరిగిపోయాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటపొలాలకు సాగు నీరు సక్రమంగా అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారు లు స్పందించి ప్రధాన, పిల్ల కాలువల్లో పూడికలు, తుప్పల తొలగింపు పనులు చేయించడంతో పాటు పిల్ల కాలువకు షట్టర్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. – రేగిడి

శిథిలావస్థలో పశువైద్య కేంద్రం



సంకిలి పశువైద్య కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. భవనం ఏ క్షణంలో కూలిపోతుందోనన్న భయాందోళనతో సిబ్బంది నిత్యం విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ పశువైద్య కేంద్రానికి సంకిలితో పాటు బొడ్డ వలస, చిన్నయ్యపేట, అప్పాపురం, మజ్జిరాముడుపేట, ఆమదాలవలస తదితర గ్రామాల నుంచి పాడి రైతులు తమ పశువులను వైద్యం కోసం తీసుకువస్తుంటారు. భవనం శ్లాబ్ పెచ్చులూడుతుండడంతో వర్షం కురిసే సమయంలో నీరు చిమ్ముతోందని, మందులు తడిసిపోతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. పలువురు పాడిరైతులు సైతం ఇదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు. – రేగిడి

నిరుపయోగంగా ఆర్టీసీ బస్ స్టేషన్


బస్ స్టేషన్


పిచ్చిమొక్కల మధ్య ఉన్న మరుగుదొడ్లు

తెర్లాం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్ స్టేషన్ దశాబ్దకాలంగా నిరుపయోగంగా ఉంది. 17ఏళ్ల క్రితం రూ.17లక్షల వ్యయంతో ఈబస్ స్టేషన్‌ను నిర్మించారు. మరుగుదొడ్లు, ప్రయాణికులు కూర్చునేందుకు బెంచీలు, తాగునీటి సదుపాయం, సిబ్బంది ఉండడానికి గదులు, అన్ని సదుపాయాలు ఉండేవి. కొన్నాళ్ల పాటు ఇక్కడికి బస్సులు వచ్చేవి. ప్రయాణికులతో బస్ స్టేషన్ సందడిగా ఉండేది. ఆర్టీసీ సిబ్బంది కూడా ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం చెప్పేవారు. సుమారు పదేళ్ల క్రితం నుంచి బస్‌స్టేషన్‌లోకి బస్సులు రావడం లేదు. బస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపైనే బస్సులు నిలుపుతున్నారు. ప్రయాణికులు బస్సు కోసం రోడ్డుపై ఎండలో ఎదురు చూడాల్సి వస్తోంది.. ప్రస్తుతం బస్‌స్టేషన్‌ను పశువుశాలగాను, రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు, బస్‌స్టేషన్ ఆవరణను బహిర్భూమిగా గ్రామస్తులు వినియోగిస్తున్నారు. ఇక్కడి తాగునీటి కుళాయిలు, మరుగుదొడ్లు పూర్తిగా శిథిలం కాగా, లోపలికి, బయటకు వెళ్లే రోడ్లు గోతులమయమయ్యాయి. ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి బస్‌స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకురావాలని తెర్లాంతో పాటు చుట్టు పక్క గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. – తెర్లాం

ప్రమాదం జరగక ముందే మేల్కొండి



బొబ్బిలి పట్టణంలోని ఐటీఐ కాలనీలో ఓ విద్యుత్ స్తంభం ఇటీవల వీచిన ఈదురు గాలులకు పక్కకు ఒరిగిపోయింది. రాయగడ రోడ్డు అంచునే ఉన్న పాత హౌసింగ్ కార్యాలయం ప్రహరీపై పడిపోయింది. శిథిలమైన స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరాజు వద్ద సాక్షి ప్రస్తావించగా స్తంభాన్ని సరిచేయిస్తామని తెలిపారు. – బొబ్బిలి

ఆర్థిక సాయం

వేపాడ: మండల కేంద్రానికి చెందిన అగ్ని ప్రమాద బాధితుడు నిరుజోగి కృష్ణకు గ్రామానికి చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం రూ.12 వేల సాయం అందజేశారు. గత ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు చూడు పశువులు, పశువుల పాక కాలిపోయిన విషయం తెలిసిందే. ఆర్థిక సాయం చేసిన ట్రస్ట్ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.